

కథా కౌముది

Punch Bag సూర్య ప్రసన్న

కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే---.

ఫోన్ అవతల వైపు నుంచి సుప్రభాతం వినిపిస్తోంది, అమెరికా సమయం రాత్రి 8:30 అయింది. ఇండియాలో పొద్దున్నే 6:30 అయి ఉంటుంది. మరీ పొద్దున్నే, అంతా పనిలో ఉంటారని తెలిసినా , అమ్మ గొంతు వినాలనిపించినప్పుడల్లా వెంటనే కాల్ చేస్తుంది సుమతి. సాహితి విషయమై మనసుకూడా బాలేదు, అమ్మ గొంతు వింటే కాస్త ఊరటగా ఉంటుంది.

మనవడు ఫోన్ ఎత్తి పక్కన పెట్టి వెళ్ళాడు.

"అమ్మాయి... సారీ రా! కొంచెం లేట్ అయింది ఫోన్ దగ్గరికి వచ్చేసరికి " పనమ్మాయికి గిన్నెలు వేసి గబగబా వచ్చి ఫోన్ అందుకుని అన్నారు జానకమ్మ గారు "అల్లుడు, పాపా ఏం చేస్తున్నారు?"

"రవి ఏదో ఆఫీస్ పనిలో ఉన్నారమ్మ, సాహితీ కలరింగ్ చేస్తోంది" ఇంకా ఏదో చెప్పబోయి ఆపేసింది సుమతి.

సాహితీ కొత్త స్కూల్ లో చేరినప్పటి నుంచి సరిగ్గా లేదు , ఎప్పుడూ చురుగ్గా గలగలా మాట్లాడే పిల్ల ఎదో ముభావంగా ఉంటుంది సరిగ్గా తినడం కూడా మానేసింది, నిన్న ఇంటికి వచ్చి "నేను నల్లగా, లావుగా వున్నా నెందుకు? తినకపోతే సన్నగా అవుతారా?" అని అడిగింది. ఎప్పుడు టెడ్డీబేర్ ఫ్లఫి తో ఏదో మాట్లాడుకుంటూ తన గదిలోనే ఉంటుంది...ఇందంతా అమ్మకు చెప్పి పొద్దున్నే బాధ పెట్టడం ఇష్టం లేక ఏమి చెప్పలేదు. ఈలోపు

సాహితీ తన పేరు వినపడగానే కలరింగ్ బుక్ పక్కనపెట్టి పరిగెత్తుకుంటూ వచ్చి అమ్మ చేతిలో ఉన్న ఫోన్ లాక్కుంది...

"గుడ్ మార్నింగ్ అమ్మమ్మ హౌ ఆర్ యు ...?"

"బాగున్నాను తల్లి నువ్వెలా ఉన్నావు? నీ పుట్టినరోజు వచ్చస్తోంది రోయ్...యు ఆర్ గోయింగ్ టు బి 8 ఇయర్ ఓల్డ్"

ముసి ముసిగా నవ్వుకుంది సాహితి.

అమ్మమ్మ తో మాట్లాడటం అంటే చాలా ఇష్టం సాహితికి. "అమ్మమ్మ నీకు తెలుసా నాకు హండ్రెడ్ పర్సెంట్ వచ్చిన్ది మ్యాథమెటిక్స్ లో "

"నాకు తెలుసు తల్లి! నీకు మీ తాత లాగా మ్యాథమెటిక్స్ అంటే ప్రాణం, ఏదో మాథ్స్ క్లబ్ మొదలెట్టాలని ఫామ్ తెచ్చుకున్నావని అమ్మ చెప్పింది, వెరీ గుడ్ ...అవును ఇంతకీ ఈ కొత్త స్కూల్ ఎలావుందీ, ఫ్రెండ్స్ అయ్యారా ?"

ఏదో చెప్పబోయి ఆపేసి ఒక్క క్షణం ఏమీ మాట్లాడకుండా ఉండిపోయింది సాహితి. ఫోన్ అమ్మకి ఇచ్చేసి పరిగెత్తుకుంటూ వెళ్లి బెడ్ ఎక్కి దుప్పటి కప్పుకుంది. ఫ్రెండ్స్....నో గో జోన్ టాపిక్...సాహితీ కళ్ళల్లో నీళ్ళు గమనించింది సుమతి. "అమ్మా.! నేను మళ్ళీ కాల్ చేస్తాను" అంటూ వెంటనే ఫోన్ పెట్టేసి సాహితీ రూమ్ వైపు కి గబగబా నడిచింది..

జానకమ్మ గారికి అర్థమైంది ఫ్రెండ్స్ గురించి అడక్కుండా ఉండాల్సింది పాప బాధపడి ఉంటుంది, అన్నం తిన్నదో లేదో, సుమతి ఎన్నిసార్లు చెప్పినా ఫ్రెండ్ టాపిక్ తీసుకురావద్దని ఏదో ధ్యాసలో అడిగింది పొరపాటుగా. మళ్లీ సుమతి కాల్ చేసే వరకు పని తోచదు జానకమ్మ గారికి.

అవమానం, కోపం, బాధ పొంగు కొచ్చాయి సాహితికి...నాకు ఫ్రెండ్స్ లేరు అన్న విషయం అమ్మమ్మ కూడా తెలిసిపోయింది దుప్పటి ముసుగులోనే టెడ్డి బేర్ ఫ్లఫీ ని గట్టిగా కౌగలించుకుని ఏడుస్తోంది.

"డిన్నర్ చేయకుండా పడుకుంటున్నావు , లేచి కాస్త పెరుగన్నం తినమ్మా " సాహితీ కప్పుకున్న ముసుగు తీస్తూ అడిగింది సుమతి.

"నో ఐ యామ్ నాట్ హంగ్రీ..." మళ్లీ దుప్పటి కప్పుకుని ఏడుస్తూనే నిద్రలోకి జారిపోయింది సాహితీ. నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయింది సుమతి.

★★★★★★★★★

"కళ్ళు ఎందుకు ఎర్రగా ఉన్నాయి రాత్రి సరిగా నిద్ర పోలేదా?" పొద్దున్నే కాఫీ చేతికి అందిస్తున్న సుమతి కేసు చూసి అడిగాడు రవి.

నిన్నటి విషయం ఇంకా ఆలోచిస్తోంది సుమతి...

"పాప బర్త్ డే కి ఏంటి ప్లాన్? ఈసారి పంపి టప్ లో వద్దు, పిజ్జా, కేక్ తినేసి వాళ్ళ ఆటలు వాళ్ళ ఆడుకొని వెళ్లిపోతారు పిల్లలు, గ్రూప్ బాండింగ్ యాక్టివిటీ ,కుకింగ్ కానీ ,సిరమిక్ వర్క్ కానీ, ఆర్ట్ వర్క్ కానీ పిల్లలు కలిసి ఆడుకునే లా ఏదైనా చూడు" పరధ్యానంలో వున్న సుమతి కేసి చూస్తూ మళ్ళీ అన్నాడు.

"అవును రవి వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఇన్వైట్ చేస్తాను స్కూల్ నుంచి ఆరుగురు, డాన్స్ క్లాస్ లో నలుగురు మొత్తం పదిమంది, కాల్ చేసి బుక్ చేయాలి ఇంకా సమయం ఉంది గా"

"మరి సంగీతం క్లాస్?" ఆశ్చర్యంగా అడిగాడు రవి.

" ఓ సంగీతం క్లాసులో సాహితీ తప్ప ఇంకెవరూ లేరు అందరూ మానేశారు" చెప్పింది సుమతి.

అదేమిటి అన్నట్టు చూస్తున్న రవితో "ఏమని చెప్పాలి, సంగీతం టీచర్ సరిత గారికి భరతనాట్యం టీచర్ పావని గారికి పడలేదు. ఒకప్పుడు సరిత గారి చేత కర్ణాటక సంగీతం క్లాసెస్ మొదలు పెట్టించింది పావని గారే, సహాయం చెయ్యడమేమో తెలీదు కానీ నెత్తికెక్కి కూర్చుంది,పెత్తనం చలాయించడం మొదలుపెట్టింది. పావని గారికి ఆశయాలు చాలా పెద్దవి. సంవత్సరానికి ఒక 20 అయినా అరంగేట్రం లు చేయిస్తారు. ఐదు వందల అరంగేట్రం లక్ష్యాన్ని సాధించి అయ్యి అవార్డు కొట్టాలని ఆవిడ కోరిక. అరంగేట్రం కి సంగీత సహాయం సరిత గారే చేసేవారు. కానీ పావని గారి స్వార్థపూరిత మనస్తత్వం నచ్చక విభేదాలు వచ్చి ఈ మధ్య మానేశారు. అప్పటి నుంచి పావని గారు కక్ష కట్టారు, పంతం, పట్టుదలతో తన దగ్గరకు వస్తున్న తల్లిదండ్రుల ని ప్రభావితం చేసి సరిత గారి దగ్గరికి వెళ్లకుండా ఏదో విధంగా ఆపేశారు. అలా తెలివితేటలు ఉపయోగించి వదిలించుకున్నారు, అనవసరమైన వైరం. ఆవిడకి నచ్చిన వాళ్ళు ఎవ్వరికి నచ్చకూడదు...అది పావని గారి తీరు. కానీ అసలు సంగతి

ఏంటంటే పెద్దవాళ్ళ రాజకీయాలతో పిల్లలు నలిగిపోతారు,ఈ వైరం వల్ల వాళ్ళ పిల్లలే కాదు, రెండు క్లాసు లకి వెళ్లే పిల్లలు కూడా విడిపోయారు. అహంకారం, గర్వంతో ఇంగితం పనిచేయలేదు, చిన్ని చిన్ని స్నేహాలను తుంచేసారు." నిట్టూరుస్తూ బాధగా అంది సుమతి.

"హుమ్ ...ఎక్కడైనా సామాజిక బాధ్యత వుందా? ఏమిటో ఈ గ్రూప్ పాలిటిక్స్. అయినా ఊరిని ఉద్ధరించటానికి కాదు అహాన్ని సంతృప్తి పరచుకోవడానికి చేసుకునే పనులు ఇవి, అందులో పావని గారు పవర్ఫుల్ లేడీ...మరి ఇంతకీ నువ్వు మాన్పించ లేదా? " చిన్నగా నవ్వుతూ అడిగాడు.

"ఏమో రవీ! నాతో కూడా ఏదో అన్నారు పావని గారు, కానీ నా మనసు అంగీకరించలేదు. నాకు ఆవిడ వ్యక్తిత్వం నచ్చదు. డాన్స్ క్లాస్ మానేద్దాం అనుకున్నాను కానీ సాహితీ కి ఒకే ఒక్క ఫ్రెండ్ 'అనన్య' అక్కడ డాన్స్ నేర్చుకుంటుంది కదా,ఇద్దరు డాన్స్ క్లాస్ లో ఖాళీ సమయంలో ఆడుకుంటారు. దగ్గర అవుతున్నారు కూడా. సాహితీ బర్త్ డే కి ఎవరూ లేకపోయినా అనన్య తప్పకుండా వస్తుంది. అందుకే మానలేదు"...

రవికేసి చుసింది సుమతి.

"అనన్య అమ్మగారు నీరజ, పావని గారి బెస్ట్ ఫ్రెండ్ కదా?" అడిగాడు రవి...

మళ్లీ ఏదో ఆలోచనలో జారుకుంది సుమతి, ఎందుకో రవి మాటకి కొంచెం భయం వేసింది. సుమతి మూడ్ గమనించి టాపిక్ మార్చాడు..."నిన్న వచ్చిన మెయిల్ చూసావా, కంగ్రాట్యులేషన్స్! యాంటీ బుల్లియింగ్ అసోసియేషన్ లో నువ్వు చేసిన 540 గంటల వాలంటీరింగ్ కి అవార్డు,ఈ రోజే కదా అవార్డు సెరెమనీ?"

అవునన్నట్టు తల ఊపింది సుమతి.

"పొద్దున్న పాపను నేను డ్రాప్ చేస్తాను.నువ్వు లంచ్ ఇచ్చి సెరమనీ కి వెళ్ళు. వచ్చేటప్పుడు పాపని నువ్వు పిక్ చేసుకుని డాన్స్ క్లాస్ కి తీసుకువెళ్లాలి. ఈరోజు ఆఫీస్ లో నాకు కొంచెం ఆలస్యం అవుతుంది. సారీ నేను అవార్డు సెరమనీ కి రాలేకపోతున్నాను" అన్నాడు రవి.

" ఏముంది రవి నీకు తెలుసు కదా నాకేమీ అవార్డ్స్ మీద పెద్దగా ఆసక్తి ఉండదు..మానసిక శాస్త్రజ్ఞుడు డాక్టర్ బ్రౌన్ ఈరోజు చీఫ్ గెస్ట్ గా వస్తున్నారు. బుల్లియింగ్ మీద ఎన్నో న్యూయార్క్ టైమ్స్ అవార్డు విన్నింగ్

పుస్తకాలు రాశారు. అవగాహన కోసం ఆయన రాసిన పిల్లల పుస్తకాలే క్లాసులో చదువుతాము. ఈ ఏ బి ఏ సంస్థ , యాంటీ బుల్లియింగ్ అసోసియేషన్ మొదలుపెట్టింది ఆయన. పాపం చిన్నప్పుడు బుల్లియింగ్ కి చెల్లెల్ని కోల్పోయారు, వారిని చూసి స్పీచ్ వినాలని అంతే! అందుకే వెళ్తున్నా " లంచ్ బ్యాగ్ అందిస్తూ అంది సుమతి.

అంతకంటే కూడా పాపని గమనించుకోవాలి,ఈ స్కూల్లో పెద్దగా పేరెంట్స్ ని లోపలికి రానివ్వరు ,కానీ ఈరోజు ఛాన్స్ వచ్చింది లంచ్ టైం పార్కింగ్ లాట్ లోనైనా పాప తింటుందో లేదో చూసుకోవాలి,

అవకాశం వదులుకోదు సుమతి.

★★★★★★★★★

కారు దిగి ఫ్లఫీ ని తీసి ఒకసారి గట్టిగా ముద్దు పెట్టుకుని లంచ్ బ్యాగ్ లో పెట్టుకుంది సాహితీ, నాన్నకి బాయ్ చెప్పేసి తెరిచి ఉన్న స్కూల్ గేట్ వైపుకి మెల్లమెల్లగా నడిచింది. పిల్లలంతా గేటు వైపుకి నడుస్తున్నారు. మైలుకంటే దగ్గర్లో ఉన్న పిల్లలంతా,నడిచి కానీ సైకిల్ మీద కానీ వస్తారు. కొంచెం దూరంగా ఉన్న పిల్లలు కారులో కానీ, బస్సు లో కానీ వస్తారు. గేటు దగ్గర టీచర్ నిలబడి పిల్లలందరినీ ఒక్కొక్కరిగా . క్లాస్ రూమ్ లోపలికి పంపిస్తారు. గేటుదాటగానే హాల్వే లో ఉన్న లాక్ రూమ్స్ లో పుస్తకాలు పెట్టుకుని క్లాస్ రూమ్ లోకి నడిచి వెళ్తున్నారు పిల్లలంతా. హాల్వేలో టీచర్లు ఎవ్వరూ ఉండరు. కాస్త భయం భయంగానే నడుస్తోంది సాహితి. చిన్ని బ్యాగ్ లో ఉన్న ఫ్లఫీని ఎవరు చూడట్లేదు కదా అని, మళ్లీ మళ్లీ చూసుకుంటూ లాకర్ బాక్స్ తెరిచి బ్యాగ్ అందులో పెట్టుకుని ఆర్ట్ , మాథెమాటిక్స్ పుస్తకాలు తీసుకుని బిక్కుబిక్కుమంటూ క్లాస్ రూమ్ లోకి వెళ్ళింది. సర్కిల్ గా అమర్చి ఉన్న బెంచ్ మీద ఆర్ట్ బుక్ పెట్టుకుని చైర్ లాక్కుని కూర్చుంది. ఫస్ట్ పీరియడ్ ఆర్ట్ పీరియడ్....

"అయ్యో మిస్ ఏప్రిల్ ఇంకా రాలేదు?!సబ్స్టిట్యూట్ టీచర్ వస్తారేమో ఈరోజు " అని మనసులో అనుకుంటూ ఆర్ట్ బుక్ తీసి ఆర్ట్ వేయబోతోంది సాహితీ. అంతే వెనకాల నుంచి ఏదో చప్పుడు వినిపించి ఒక్కసారిగా బెదురుతూ తిరిగి చూసేసరికి తన బ్యాగ్ లో ఉన్న ఫ్లఫీ ని ఎవరో కింద పారేశారు.

"ఓ ఇది ఎవరి బ్యాగ్? టెడ్డీబేర్ ఉంది. ఎవరు లిటిల్ కిడ్డు?" అంటూ ఎగతాళిగా నవ్వింది స్టేసి....కాలి కింద తొక్కి గట్టిగా నలిపేసింది ఫ్లఫీని, వెక్కి వెక్కి ఏడుపొచ్చేసింది సాహితికి. అయినా తనకు ఏమీ తెలియదన్నట్టు ఆ బొమ్మ తనది కాదన్నట్టు కదలకుండా బిగుసుకుని కూర్చుండిపోయింది. ఆర్ట్ క్లాస్ అయిన వెంటనే మాథ్స్, తనకి చాలా ఇష్టమైన క్లాస్ మిస్ లీ వచ్చారు అందరికీ పేపర్స్ ఇచ్చి సాల్వ్ చేయమన్నారు. రెండు

నిమిషాల్లో సాల్వ్ చేసేసి లేచి పరిగెత్తి వెళ్లి టీచర్ కి ఇవ్వబోగా తన వైపు కొరకొరా చూస్తున్న కారోలిన్ ని చూసి కాస్త బెదురుగా మళ్లీ బెంచ్ దగ్గరికి వెళ్లి కూర్చుండిపోయింది. ఏ గ్రేడ్ వచ్చిన పిల్లలు ఇంట్రెస్ట్ ఉంటే మ్యాథమెటిక్స్ 'పియర్ హెల్ప్ క్లబ్' మొదలు పెట్టడానికి ఆఖరి రోజు ఏప్రిల్ ఒకటి అని గుర్తుచేస్తూ క్లాస్ ముగించారు వెళ్లిపోయారు మిస్ లీ.

రీసెస్ బెల్ కొట్టారు. రీసెస్ అంటే చాలా భయం సాహితికి. క్లాస్ రూమ్ లో పిల్లలంతా బయటికి వెళ్లి స్నాక్ బాక్స్ తీసి తింటున్నారు. బెంచ్ దగ్గరే ఇంకా కూర్చుని ఉంది, అంతా వెళ్ళిపోయాక మెల్లగా వెనక్కి తిరిగి చూసింది నలిగిపోయి పడి ఉన్న ఫ్లఫీ కేసి బాధగా. వెంటనే వెళ్లి ఫ్లఫీ ని చేతిలోకి తీసుకుని గట్టిగా హత్తుకొని ఏడ్చేసింది.

"యు ఆర్ మై ఓన్లీ ఫ్రెండ్ , ఆర్ యు ఓకే?"

ఎవ్వరు చూడకుండా పరిగెత్తుకుంటూ హాల్ వే లో లాకర్ ఓపెన్ చేసుకొని ఫ్లఫీని మళ్లీ బ్యాగు లో పెట్టుకోబోయి, అలా కాదు టీచర్ కి కంప్లైంట్ చేయాలి అనుకుంటూ ఏదో ధైర్యం పొంగు కొచ్చినట్టు ప్రిన్సిపల్ రూమ్ వైపు నడిచింది. దారిలో మళ్లీ స్టేసి కనిపించింది. స్టేసి పాపులర్ కిడ్ ,తన చుట్టూ ముగ్గురు,నలుగురు పిల్లలు ఎప్పుడూ ఉంటారు. కారోలిన్, జేనెట్ ,ఈషా ,జూలీ స్టేసీ తో నడుస్తున్నారు.

సాహితీ ని చూసి ఒక్కసారిగా ఆగింది. సైడ్ కిక్కులా స్టేసి ఏం చేస్తే అదే చేస్తారు మిగతా పిల్లలంతా.

"ఓ ఆర్ యు గోయింగ్ టు కంప్లైంట్ టు ద ప్రిన్సిపల్? యు కెన్ నెవర్ బి అవర్ ఫ్రెండ్ రిమెంబర్ దట్" అంటూ వార్నింగ్ ఇచ్చినట్టు చెప్పి అక్కడి నుంచి వెళ్ళిపోయింది మిగతా పిల్లలతో. ఒంటరిగా నిల్చుండి పోయింది సాహితీ.

"ఐ హేట్ రీసెస్ "....

★★★★★★★★

కార్ పార్క్ చేసి స్కూల్ గేటు వైపు చూసింది, సుమతి. అప్పుడే రీసెస్ అయి ఉంటుంది పిల్లలంతా లోపలికి వెళ్తున్నారు. "సాహితి కూడా క్లాస్ లోకి వెళ్లి ఉంటుంది, లంచ్ టైం లో ఎలాగైనా కాసేపు గమనించుకోవాలి" అనుకుంటూ లంచ్ బాక్స్ తీసుకుని ఆఫీస్ రూమ్ లో డ్రాప్ చేసి మీటింగ్ హాల్ వైపు నడిచింది.

హాలంతా వాలంటీర్లతో నిండిపోయింది, కనీసం 500 మంది ఉంటారు. ఏ బి ఏ చాలా పెద్ద వాలంటీరింగ్ సంస్థ అమెరికా వ్యాప్తంగా ఎంతో మంది పేరెంట్స్ వాలంటీర్ల సహాయంతో నడుస్తోంది. చుట్టుపక్కల నుంచి ఎలిమెంటరీ, మిడిల్, హై స్కూల్ పేరెంట్స్ వాలంటీర్స్ అంతా వచ్చారు, ఈ సంస్థను స్థాపించిన డాక్టర్ బ్రౌన్ స్టేజ్ మీదకు వచ్చారు పేరెంట్ వాలంటీర్స్ కి పేరుపేరునా పిలిచి అవార్డు ఇచ్చారు.డాక్టర్ బ్రౌన్ నుంచి అవార్డు తీసుకోవడం కొంచెం ప్రోత్సాహంగా అనిపించింది సుమతికి.

"గుడ్ మార్నింగ్ డియర్ పేరెంట్స్ అండ్ వాలంటీర్స్ ఆఫ్ ది ఏ బి అసోసియేషన్,వెల్కం ప్లీజ్ బీసీటెడ్". "ఆల్సో కంగ్రాట్యులేషన్స్ ఆల్ ద అవార్డు విన్నర్స్ " ప్రిన్సిపల్ మిస్సెస్ 'లూసి క్యాంబెల్' ఆహ్వాన పూర్వకంగా పలకరించి స్పీచ్ మొదలు పెట్టింది. "మీ సమయాన్ని నేను ఎక్కువ తీసుకోను. క్రితం సంవత్సరం డేటా ప్రకారం అమెరికాలో ఉన్న స్కూల్స్ వ్యాప్తంగా పరిశీలిస్తే 12 నుంచి 18 ఏళ్ల వయసులో ఉన్న పిల్లల్లో, ఐదుగురిలో కనీసం ఓ బాలిక బుల్లీయింగ్ బారిన పడ్డారు. ఇందులో చనిపోయిన పిల్లల జాబితా ప్రైవసీ కారణాల వల్ల స్టేట్స్ బయట పెట్టవు. రిపోర్టు చేయకపోవడం కారణంగా 11 ఏళ్ల లోపు పిల్లల రికార్డ్స్ పెద్దగా లేవు. ఇది చాలా దురదృష్టకరం.ఈ బుల్లీయింగ్ మహమ్మారిని తొలగించాలంటే దాని గురించి మనం క్షుణ్ణంగా తెలుసుకోవాలి. అందుకు ఈ కాన్ఫరెన్స్ ఎంత అవసరమో మీ అందరికీ తెలుసు, ఈ సంవత్సరం కూడా డాక్టర్ బ్రౌన్ మన మన స్కూల్ ఎంచుకుని రావటం మన అదృష్టం,విత్తౌట్ ఫర్దర్ డ్యూ లెట్ అస్ వెల్కమ్ డాక్టర్ బ్రౌన్ "

కరతాళ ధ్వనులతో హాల్ అంతా మారు మోగిపోయింది.

" ఆశావాదులకి శుభోదయం". డాక్టర్ బ్రౌన్ వాలంటీర్లని ఉద్దేశించి ప్రసంగం మొదలుపెట్టబోతూ ఒక్కసారి హాలంతా కలియ చూశారు డేవిడ్ కోసం. ఇదే స్కూల్లో 13 ఏళ్ల క్రితం బుల్లియింగ్ వల్ల కొడుకుని పోగొట్టుకున్న డేవిడ్,ఆ పిల్లాడి అంత్యక్రియలకు చుట్టుపక్కల స్కూళ్లన్నీ తరలి వెళ్లాయి, Dr.బ్రౌన్ తో సహా అంతా కాండిల్ లైట్స్ తో సంతాపం చూపించారు కూడా. ఒక్క బుల్లీ మారినా అతని పిల్లాడి ఆత్మ శాంతిస్తుంది. అంత వరకు పోరాటం చేస్తానని ఆవేదనతో Dr బ్రౌన్ కి మాటిచ్చాడు,డేవిడ్. ప్రతి సంవత్సరం మీటింగ్ కి వస్తాడు. ఈ రోజు ఎందుకో ఇంకా రాలేదు. ఒక్క క్షణం ఆగి మళ్లీ మొదలుపెట్టాడు డాక్టర్ బ్రౌన్.

"సమాజానికి ఉపయోగపడాలని విలువైన మీ సమయాన్ని వెచ్చించి, మంచి జరుగుతుందని ఆశావాదంతో సేవ చేస్తున్న మీ అందరికీ నా అభినందనలు. నా నుంచి ఈరోజు మీరు ఏదో నేర్చుకోవాలని వచ్చారు. దానికి మీకు నా కృతజ్ఞతలు. ఇన్నేళ్ల నా అనుభవంలో నుంచి నేర్చుకున్న పాఠాలలో కొన్నిటిని ఈరోజు

మీతో పంచుకుంటాను. మనిషి సంఘ జీవి,ఈరోజు టాపిక్ కూడా అదే. అయితే పెద్ద పెద్ద సంఘాలు కాదు కానీ, చిన్న గ్రూపుల గురించి మాట్లాడుకుందాం. ఎందుకంటే అక్కడే ఎక్కువ బుల్లియింగ్ జరిగే అవకాశాలు ఉన్నాయి. మీరు గమనించే ఉంటారు గ్రూప్ లో మెజారిటీ నలుగురి మాటే ఎక్కువ గా చెల్లుతూ ఉంటుంది, మీరంతా అనుకోవచ్చు 'మరి పాపులర్ గా ఉన్నవాడు ఒక్కడే ఉంటాడు. వాడి చుట్టూనే కదా బెల్లం చుట్టూ ఈగలు చేరినట్టు మిగతావాళ్లంతా చేరుతారు' అని. కానీ ఆ పాపులర్ వ్యక్తి కి పాపులారిటీని, బలాన్ని ఇచ్చేది చుట్టూ చేరిన భజన మూకే.

ఇంట్లో తల్లిదండ్రులు, తోబుట్టువులు, చుట్టాల వల్ల కానీ, లేదా వారి చుట్టుపక్కల సమాజం వాళ్ళ కానీ ప్రతికూలమైన, అనారోగ్యకరమైన వాతావరణంలో పెరిగే పిల్లలు, వారు ఎదుర్కున్న దారుణమైన పరిస్థితుల, సంఘటనల ప్రభావం వల్ల బుల్లీ గా మారతారు. బాధ, భయం,అభద్రత,నిస్సహాయత వల్ల కలిగిన సంఘర్షణ ఇంట్లో చూపించుకుంటే ఇంకా వేధింపులకు గురి కావచ్చు కనుక, తమలో పేరుకుపోయిన కోపాన్ని ద్వేషం గా మార్చుకుని, పరిణామాలు లేని సురక్షితమైన ప్రదేశాల్లో ఉపయోగిస్తారు. బలహీనంగా అమాయకంగా కనిపించే వాళ్ళమీద ప్రదర్శిస్తారు. దీన్ని సైకాలజీ లో " డిస్ప్లేసెమెంట్ అఫ్ యాంగర్" అంటారు. సరయిన సమయం లో వీళ్ళని దారిలో పెట్టకపోతే 'సోషయోపత్' లాగా నరస్సిస్ట్ లాగా మారచ్చు కూడా. మగపిల్లలలో అయితే భౌతికంగా, ఆడపిల్లలలో ఐతే మానసికంగా ఉంటాయి వేధింపులు. వీరిలో సహజం గానే సానుభూతి తత్వం ఉండదు. ప్రయత్నపూర్వకంగా కృంగదీస్తారు. వీరు ఎదుర్కునే బాధాకరమయిన జీవితాన్నుంచి ఊరట పొందానికే వీరిపనులు చేస్తువుంటారు. ఇది ఒక రకమైన 'డిఫెన్స్ మెకానిజం'. వీళ్ళు టార్గెట్ చెయ్యాలనుకున్న పిల్లలని చులకన చేసి, నిందారోపణలు, అవమానాలకు గురి చేసి గ్రూప్ లో నుంచి ఒంటరిని చేస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే వీరికి పంచ్ బాగ్ లు కావాలి.

బుల్లీ బారిన పడి సోషల్ ఐసోలేషన్, అణచివేతకు గురైన పిల్లల పరిస్థితి చాలా దయనీయంగా ఉంటుంది. 90% మంది పిల్లలు డిప్రెషన్ కి గురవుతారు, వీరికి వాలిడేషన్ దొరకదు కాబట్టి సెల్ఫ్ డౌట్ తో ఒక రకమైన సర్వైవల్ మోడ్లో బతికేస్తారు,నర్సాసిజాం చేతికి చిక్కేది కూడా ఇలాంటి పిల్లలే." ధారాళంగా మాట్లాడుతున్న Dr బ్రౌన్ గొంతు కొంచెం బొంగురు పోయింది. కాసేపు నిశ్శబ్దంగా ఉండి పోయారు.మళ్లీ తేరుకుని ప్రసంగం కొనసాగించారు., "మన చుట్టూ వున్న పరిస్థితులు మన స్వభావాన్ని నిర్దేశిస్తాయి, చుట్టూ ఉన్నవాళ్ళు ఒక పద్ధతిలో ప్రవర్తించినప్పుడు, మనం అందుకు భిన్నంగా ఉండడం 'తెగ నుండి వేరుపడటం' గా మన మనస్సు నిర్వచిస్తుంది, ఎట్టి పరిస్థితుల్లోను సంఘాన్ని కోల్పోడం ఇష్టపడం కాబట్టి తొందరగా ధైర్యం చేసి వ్యతిరేకించం. అందుకే, ఎదురు చెప్పే ధైర్యం లేక "ఇఫ్ యు కె నాట్ బీట్ దెన్ ఫాలో "అని కావచ్చు , సానుభూతి మనస్తత్వం

లేకపోవడం వల్ల కావచ్చు బుల్లీ చుట్టూ చేరిన భజన మూక కూడా అదే దారిలో వెళ్తారు. ఇక గ్రూప్ ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేస్తాడు ఈ పాపులర్ బుల్లీ. వాళ్ళు ఆడ, మగ ,పెద్ద, చిన్నయినా కావచ్చు.' 'బుల్లీ హా స్ నో జెండర్' 'బుల్లీ హాస్ నో ఏజ్".

తదేకంగా వింటున్న సుమతికి ఎందుకో ఒక్కసారిగా పావని గారు గుర్తుకొచ్చారు.

"ఇంతకి మీలో ఎవరైనా సోషల్ మీడియా లో చాలా ఫేమస్ అయిన జపాన్ లో ఒక జూ కి చెందిన పంచ్ అనే చిన్న కోతి పిల్ల వీడియోస్ చూసారా ? కారణాలు తెలియదు కానీ ఎందుకో తల్లి ఆ చిన్నపిల్లల్ని దూరం పెట్టింది ,తల్లి ప్రేమకు దూరమైన ఆ చిన్నారి కోతి పిల్ల జూ వాళ్ళు ఇచ్చిన టెడ్డీబేర్ లో తల్లిని చూసు కుంటూ మిగతా కోతి మూకల తో ఇమడడానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది. కోతి పిల్ల ఇంత ఫేమస్ అవ్వడానికి కారణం, దానిలో మనల్ని మనం చేసుకుంటున్నాం. మనని బాధించి, చులకన చేసి దూరం పుట్టినవాళ్ళు మనకి గుర్తొస్తున్నారు. సమాజంలో ఇమడ లేని బాధ ఏంటో సమాజం దూరం పెట్టిన వాళ్ళకే తెలుస్తుంది".

కాసేపు ఆగి హాలంతా మళ్లి కలియ చూశారు Dr బ్రౌన్.

"ఇక మన టాపిక్ కి వస్తే.. వాళ్ళ తప్పు లేకపోయినా ఒక రకం పిల్లలు జీవితం నేర్పించే పాఠాలలో విలువలకి సంబంధించిన కొన్ని నీతి పాఠాలు మిస్ అయితే,ఇంకో రకం పిల్లలు బుల్లీ ని ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం, తట్టుకునే కోపింగ్ స్కిల్స్ మిస్ అవుతున్నారు. ఈ ప్రోగ్రాం ఇచ్చిన పాఠ్యప్రణాళిక ద్వారా మీరు ఆ వెలితిని భర్తీ చేయాలి. బుల్లీ కి సున్నితం గా బుద్ధి చెప్తూనే గ్రూప్ లో పాపులర్ పిల్లను గుడ్డిగా అనుసరించకుండా వాళ్ళు చేసే దుర్మార్గాన్ని ధైర్యంగా ఆపగలిగి , బై స్టాండర్డ్ లా చూస్తూ ఉండ కుండా ఆప్ స్టాండర్ లా బుల్లీ బారిన పడే వారి తరపున మాట్లాడాలి, ఇలా వెన్నంటి నిలబడగలిగే ధైర్యాన్ని పిల్లల్లో మీరు నింపాలి. టాక్సిక్ గ్రూప్ డైనమిక్స్ ని మార్చాలి, అవేర్నెస్ తీసుకు రావాలి. అయితే ఒక్క మాట గుర్తు పెట్టుకోండి, బుల్లీ చెడుదారిన పడిన పిల్లలే కానీ చెడ్డ పిల్లలు కాదు. వారితో చాల జాగ్రత్తగా ఉండాలి. పిల్లలకి మంచి దారి చూపించి ఆదర్శంగా నిలిచే బాధ్యత తల్లిదండ్రులదే కాదు సమాజానిది కూడా, ఎందుకంటే "ఇట్ టేక్స్ ఏ విల్లెజ్ టు రైస్ ఏ చైల్డ్ "(it takes a village to raise a child)చాలా పెద్ద బాధ్యత మీ చేతిలో ఉంది, ఈనాటి బాలురే రేపటి సభ్య సమాజం" అని ప్రసంగాన్ని ముగించారు Dr బ్రౌను.

హాల్లోకి అప్పు డే వచ్చి చివరగా ఉన్న కుర్చీలో కూర్చున్న డేవిడ్ మీద నిలిచాయి డాక్టర్ బ్రౌన్ చూపులు. మానసికంగా చాలా నలిగిపోయిన డేవిడ్ కళ్ళలో ఆశావాదం ఇంకా మిగిలి ఉంది.

★★★★★★★

లంచ్ బెల్ కొట్టారు. పిల్లలంతా లంచ్ బాక్స్ లతో బయటకు వస్తున్నారు పార్కింగ్ లాట్ లో కార్లో కూర్చుని చూస్తే ఓపెన్ స్పేస్ గా ఉన్న లంచ్ ఏరియా అంతా బాగా కనిపిస్తుంది. వస్తున్న పిల్లల్లో సాహితి కోసం వెతికింది సుమతి. పది నిమిషాలు అయింది. అందరూ ఇంచుమించుగా బయటికి వచ్చారు. ఆఫీస్ రూమ్ లోకి వెళ్లి లంచ్ బాక్స్ తెచ్చుకుని లంచ్ ఏరియా కి వచ్చింది..మెల్లమెల్లగా అడుగులు వేస్తూ... ఎక్కడ కూర్చోవాలో చూసుకుంటోంది,. పిల్లలంతా గ్రూప్స్ గ్రూప్స్ గా కూర్చున్నారు ఒక్కో గ్రూప్ ని గమనిస్తూ నడుస్తోంది, ఎక్కడైనా తనకి చోటు ఉంటుందా అని చిన్ని ప్రయత్నం వదులుకోలేదు. స్వింగ్ పక్కగా ఉన్న చెట్టు కింద ఒక బెంచ్ మీద కూర్చుంది జూలీ. నవ్వి నవ్వనట్టు చూసింది వస్తున్న సాహితీ వైపు పలకరింపుగా... ఈ కాస్త ప్రోత్సాహం చాలు మెల్లగా ఊపిరి పీల్చుకుంది. ఒక్క క్షణం ఆగి లంచ్ బాక్స్ కేసి చూసుకుంది. అమ్మ బెండకాయ కూర చేసింది, తన ఫేవరెట్ ..కానీ జూలీ కి తన 'ఫుడ్ స్మెల్' ఇష్టం ఉండదు ఎగతాళి చేస్తుంది పక్కనే ఉన్న ట్రాష్ కాన్ లో లంచ్ బాక్స్ లో ఉన్న అన్నం పారేసింది జూలీ కి కనపడకుండా...దూరం నుంచి గమనిస్తున్న సుమతికి గుండె పిండేసినట్టు అయింది...బిడ్డ రాత్రి కూడా ఏమీ తినలేదు. పొద్దున కూడా పాలు ఒక్కటే తాగింది. ఆపడానికి ప్రయత్నం చేయలేదు అక్కడ లంచ్ కంటే కూడా ముఖ్యమైన విషయం ఉందని అర్థం చేసుకుంది సుమతి.

జూలీ దగ్గరికి పరిగెత్తుకుంటూ వెళ్లి పక్కన కూర్చుంది...."నీ లంచ్ బాక్స్ ఏది?" అడిగింది జూలి. "ఓ నేను తినేసాను " అంటూ మొహం పక్కకు తిప్పుకుంది సాహితి.

ఈలోపు ఎక్కడి నుంచి వచ్చారో స్టేసి క్యారులిన్ తో సహా మిగతా గ్రూప్ అంతా చేరింది. స్టేసీ ని చూడగానే తన కేమి సంబంధం లేదు అన్నట్టు సాహితికి కొంచెం దూరంగా జరిగి కూర్చుంది జూలీ. సాహితీ చిన్నబుచ్చుకుంది, ఇక లేచి వెళ్ళిపోదామని అనుకునే లోపు కూర్చోమన్నట్టు సైగ చేసింది స్టేసి, ఏదో ఉపకారం చేస్తున్నట్లు...ఇష్టం లేకపోయినా అలాగే కూర్చుంది. కాసేపు సాహితిని పూర్తిగా మర్చిపోయి వాళ్లంతా ఏదో కబుర్లలో పడ్డారు. కడుపులో ఆకలి మండిపోతోంది సాహితికి. ఏదో పోగొట్టుకున్నట్టు నిరాశగా చూస్తోంది..."నాకు మాథ్స్ అంటే ఇష్టం లేదు , ఐ ఫెయిల్డ్ "...నవ్వుతూ అంది ఎలీనా.

" ఓహ్ మై గాడ్ నెను కుడా. ఐ హేట్ ది టీచర్ " వంత పాడింది క్యారోలిన్.

"ఓహ్ మై గాడ్ మాథ్స్ చాలా హార్డ్ " అంది జూలీ.

"ఎస్ ఎస్ నాక్కూడా మేథ్ ఇష్టం లేదు " అబద్ధం చెప్పింది సాహితీ.

"ఓహ్ అవునా " జూలీ మాట కలుపుగోలుగా అనిపించి చిన్న నవ్వు నవ్వింది సాహితీ. అందరూ తన కేసి చూడడం చూసి..."నా బర్త్ డే వస్తోంది. మీరందరూ తప్పకుండా రావాలి " స్నేహపూర్వకంగా ఆశగా అంది సాహితి.

"ఒహ్ ఏప్రిల్ ఫస్ట్ కదూ ...ఏప్రిల్ ఫూల్స్ డే" వెటకారంగా నవ్వింది స్టేసి.

"కానీ మా ఏప్రిల్ 4 సాటర్డే సెలబ్రట్ చేస్తోంది అమ్మ " వాళ్లు రావడం తనకు ముఖ్యమైనట్టు కాస్త జాలిగా చూస్తూ అంది సాహితి.

"మేము రాము, జులీ ఇంట్లో ఫూల్స్ పార్టీ కి వెళ్లాలి " తన మాటే అందరి మాట అన్నట్టు గా చెప్పేసింది స్టేసి. ముందు కాస్త అయోమయంగా చూసినా అబద్ధాన్ని నిజం చేస్తూ ... "ఎస్ ఎస్ వి హావ్ పార్టీ"ఎగతాళిగా నవ్వేశారు అందరూ.

అవమానంగా తలదించుకుని వెనక్కి తిరగకుండా ఏడుస్తూ క్లాస్ రూమ్ లోకి పరిగెత్తింది సాహితి."ఐ హేట్ లంచ్ టైం....".

"ఓహ్ బై ది వే ఎంజాయ్ యువర్ బర్త్డే యు ఫూల్.... యు ఫూల్... యు ఫూల్ "...చప్పట్లు కొడుతూ నవ్వుతూ ఎగతాళి చేశారు.

గట్టిగా చెవులు మూసుకొని రూమ్ లో కూర్చున్నా వినిపించాయి సాహితికి ఆ అరుపులు నవ్వులు ...."ఐ హేట్ స్కూల్" బిగ్గరగా ఏడ్చేసింది...దూరం నుంచి ఇదంతా గమనిస్తున్న సుమతి కడుపులో ఎవరో గట్టిగా కొట్టినట్టు అనిపించింది. దగ్గరికి వెళ్లి బుద్ధి చెప్పాలనిపించింది. కానీ స్కూల్ రూల్స్ ఒప్పుకోవు. ఇంత జరుగుతున్నా సాహితీ ఎందుకు కంప్లైంట్ చేయలేదు? ....భయం... అప్పటికప్పుడు వెళ్లి పిల్లను గట్టిగా కౌగలించుకోవాలనిపించింది. ప్రిన్సిపాల్ దగ్గరికి తనే వెళ్లి కంప్లైంట్ చేయాలనిపించింది. ఇదివరకు చేసింది కానీ ప్రిన్సిపల్ రూల్స్ ఒప్పుకోవని, పిల్లలు మాత్రమే చేయాలని చెప్పింది. పైగా అప్పటి నుంచి పిల్ల ఇంట్లో స్కూల్ విషయాలు చెప్పడం మానేసింది..

బెల్ కొట్టారు. పికప్ ఏరియా వైపు పరిగెత్తింది సుమతి. అమ్మని చూడగానే పరిగెత్తుకుంటూ వచ్చి సాహితీని గట్టిగా హత్తుకుంది సుమతి.

"లెట్స్ గో అమ్మ " అంటూ పాడైపోయిన టెడ్డీ బొమ్మని చూపించకుండా ఏడుపు ఆపేసుకుని "ఫ్లుఫి ఐస్ హర్ట్ ఫ్లుఫి ఐస్ ఇన్ పెయిన్ ...." సన్నగా మూలుగు వినపడింది. పరిగెత్తుకుంటూ కారు ఎక్కి సీట్ బెల్ట్ పెట్టుకుని ఫ్లఫీ ని గట్టిగా కౌగలించుకుని కూర్చుంది...దుఃఖం ఆగలేదు సుమతికి. కొంచెం గొంతు సవరించుకుని..."పిజ్జా తింటావా అమ్మలు?"...ఏడ్చి ఏడ్చి పీక్కుపోయి ఉన్న బిడ్డ మొహం చూసి అడిగింది.

"ఎస్ అమ్మ ఐ ఆమ్ హంగ్రీ .....వెరీ హంగ్రీ " స్కూల్ పక్కనే ఉన్న పిజ్జా ప్లేస్ లో ఆగి అక్కడ పిజ్జా, ఐస్ క్రీమ్ ఇప్పించింది.

"ఈరోజు డాన్స్ క్లాస్ వద్దులేమ్మా ఇంటికి వెళ్లి పోదాం అలసట గా ఉన్నావు కదా " మెల్లగా అడిగింది సుమతి. సాహితీ డాన్స్ క్లాస్ చాలా ఇష్టం అక్కడ అనన్య ఉంటుంది..."నో నో అనన్య ని చూడాలి నేను వెళ్తాను"

★★★★★★★★

పిజ్జా ప్లేస్ నుంచి భరతనాట్యం డాన్స్ క్లాస్ కి 45 నిమిషాలు పడుతుంది కార్ లో ....అలసిపోయి ఉందేమో ఎక్కగానే నిద్రలోకి జారు కుంది సాహితీ....ఆలోచిస్తోంది సుమతి....ఇది ఇవాల్టి నిన్నటి సమస్య కాదు ఎంత అవేర్నెస్ క్రియేట్ చేసినా ఈ పిల్లల్లో మార్పు రావట్లేదు. కారణం తల్లిదండ్రులా? సమాజమా? రెండునూ ...Dr బ్రౌన్ అన్నమాట గుర్తుకు తెచ్చుకుంది. ఎస్ " ఇట్ టేక్స్ ఏ విలేజ్ టు రైజ్ ఎ చైల్డ్ " ...కానీ ఆ సామాజిక బాధ్యత మనం తీసుకుంటున్నామా? తన ప్రయత్నం తాను చేసింది...స్టేసీ పేరెంట్స్ ని కలవాలనుకుంది కానీ సవితి అక్క తప్ప తల్లిదండ్రుల్ని ఎప్పుడు స్కూల్లో చూడలేదు, తల్లి మానసిక వ్యాధి తో బాధపడుతోంది, తండ్రి వాళ్ళతో ఉండరని మాత్రమే తెలుసు. Mrs ఏప్రిల్ వల్లకూడా అంత సహాయం దొరకలేదు. పైగా ఆవిడకి కాస్త పక్షపాత బుద్ధి కూడా, పోనీ తన పిల్లకి ధైర్యం చెప్పుకుందామంటే అసలు స్కూల్ లో జరిగే విషయాలు దాస్తోంది ఈరోజు కళ్లారా చూస్తే కానీ ఇంత జరుగుతోందని తెలియదు..నా పిల్లకే ఎందుకు ఇలా??...అయినా గుఱ్ఱానికి నీరు చూపించగలం కానీ తాగించలేం కదా....మనసంతా నిరాశ కమ్ముకుంది.

ఈలోపు వాట్సాప్ కాల్. అమ్మ చేస్తోంది.. వెనకాల సాహితీ పడుకునే వుంది...ఇండియా లో టైం తెల్లారుఝాము 4 అయివుంటుంది మరీ ఇంత పొద్దున్నే చేసిందేంటి అనుకుంటూ ఎత్తింది....

"అమ్మ ఏంటి ఈవేళలో లో చేసావు?" కంగారుగా అడిగింది సుమతి

"ఆ ఆ అంతా బాగున్నాము. నిన్న నువ్వు అర్ధాంతరంగా కాల్ కట్ చేసావు. ఎలావున్నావా? అని చేశాను...ఇంతకీ పిల్ల ఎలావుందీ...?? "అడిగారు జానకమ్మగారు.

"డాన్స్ క్లాస్ కి వెళ్తున్నాం ఇంకొద్ది నిమిషాల్లో చేరుకుంటాం" సుమతి గొంతులో నీరసం అర్థమయింది జానకమ్మగారికి.

"సుమతీ.. నువ్వు మనసువిప్పి మాట్లాడి ఎంత కాలమైంది? ఎదో బాధపడుతున్నావ్ ...ఒక్క విషయం జ్ఞాపకం పెట్టుకో నువ్వు అలా డీలా పడితే ఇంకా పాపకు ఏమి ధైర్యం చెప్పగలవు? అయినా అసలు నువ్వెందుకు ధైర్యం కోల్పోతున్నావు? ఒక్కసారి నీ చిన్ననాటి రోజులు గుర్తు తెచ్చుకో. ఒక్కదానివే మన ఊరి నుంచి రోజు గంటల తరబడి బస్సులో పొద్దున్నే చీకట్లోనే బయలుదేరి చదువుకోవడానికి వెళ్లి ,మళ్ళీ చీకటి పడ్డాక కానీ ఇంటికి వచ్చేదానివి కాదు..ఈ మధ్యలో ఆకతాయిల వెర్రి చూపులు వెక్కిలి చేష్టలు...ఎంత మందిని ఎదుర్కుని బుద్ధి చెప్పావో, ఎంత కష్టపడి చదువు పూర్తి చేసావో ఒక్కసారి గుర్తు తెచ్చుకో. ఎదిరించి పోరాడాలే కాని నక్కి కూర్చోకూడదు. నీ వ్యక్తిత్వం ఏమైంది!? నేను కూడా అధైర్యం తో వుండి ఉంటే నువ్వింత ప్రయోజకురాలివి అయ్యే దానివి కాదు....అమ్మలు ఒక్క మాట.... మన విలువలకి సరిపడని వారితోకాని, పరిధి దాటి ప్రవర్తించే వాళ్ళతో కానీ ఎట్టిపరిస్థితుల్లోనూ దూరంగా ఉండమని పిల్లకి అర్థమయ్యేటట్టు చెప్పు....తుమ్మితే ఊడిపోయే ముక్కు లా ఉండే స్నేహాలు వద్దు..గుర్రాన్ని నీటి దగ్గరకి తీసుకెళ్లగలం తాగించలేం నిజమే కానీ గుఱ్ఱానికి దాహం పుట్టిస్తే నీటి కేసి అదే పరిగెట్టి వెళ్తుంది....పిల్లకి దాహం పుట్టించు"..

జానకమ్మగారి మాటలకి కొండత ధైర్యం వచ్చింది సుమతి కి ...ఫోన్ఐపోగానే నిద్రలోంచి లేచింది సాహితీ.

ఇద్దరు డాన్స్ క్లాస్ లో కి వెళ్లారు. సుమతి ఊహించినట్టు గానే సాహితితో బ్రేక్ టైం లో ఆడుకోలేదు. అనన్య అసలు మాట్లాడుకోలేదు కూడా...పావని గారికి ఆఖరి చెక్ రాసిస్తు అదే ఆఖరి రోజుని ఇక సాహితీ డాన్స్ క్లాస్ కి రాలేదని చెప్పేసింది సుమతి...అప్పుడే తీసుకున్న నిర్ణయం అయినా సాహతి మొఖంలో ఎక్కడా బాధ కనపడలేదు సుమతికి...అమ్మ మాటలు విన్నదా?

★★★★★

స్ప్రింగ్ బ్రేక్...వారం రోజుల తర్వాత ఏప్రిల్ 1st స్కూల్ తెరిచారు.

"హ్యాపీ బర్త్డే సాహితీ " క్లాస్ రూమ్ లోకి వచ్చి కూర్చున్న సాహితీ దగ్గరకు వచ్చి కౌగిలించుకుంటూ పలకరించారు Mrs ఏప్రిల్ ...

" OMG యు అర్ 8 ".

"థాంక్స్ Mrs ఏప్రిల్ , నేను Mrs క్యాంప్బెల్ రూమ్ కి వెళ్లవచ్చా?"

పుట్టినరోజు నాడు పిల్లలు ప్రిన్సిపాల్ రూమ్ కి వెళ్ళి క్యాండీ తెచ్చుకుంటారు.

అలాగే అని పంపించింది Mrs ఏప్రిల్.

సాహితీ లాకర్ రూమ్ కి వెళ్లి తన బాగ్ తీసి అందులో వున్న రెండు ఫార్మ్స్ తీసి మళ్ళీ లాకర్ తాళం వేసి మార్కర్ తో లాకర్ మీద "ఫూల్స్ టచ్ దిస్ " అని రాసి పెట్టి నేరుగా ప్రిన్సిపల్ రూమ్ కి నడిచింది....

"వెల్కమ్ డియర్ సాహితి ...హ్యాపీ బర్త్ డే " ప్రేమగా పలకరిస్తూ క్యాండీ చేతికి అందించారు Mrs లిసా క్యాంప్బెల్ . సాహతీ క్యాండీ తీసుకుని అంతకుముందు అమ్మ సాయంతో పూర్తి చేసిన రెండు ఫార్మ్స్ లో ఒకటి ప్రిన్సిపాల్ కి ఇచ్చింది.

"వాట్ ఏ గుడ్ డెసిషన్ ఆన్ బర్త్డే , ఐయామ్ స్యూర్ యు అర్ బ్రిలియంట్ ఇన్ మాథెమాటిక్స్ " అంటూ పీర్ ట్యూటరింగ్ ఫారం తీసుకుని, ఆ రోజే ఆఖరిరోజని క్లబ్ ఫార్మ్ చేయాలంటే కనీసం ముగ్గురు పిల్లలు సైనప్ చెయ్యాలని రీసెస్ టైం లో బోర్డు పెట్టుకుని లంచ్ ఏరియా లో కూర్చుంటే పిల్లలు వచ్చినప్పుడు వారికి ఫార్మ్స్ ఇచ్చి సైనప్ చేయించమని సలహా ఇస్తూ ఒక 6 ఫార్మ్స్ కూడా చేతికిచ్చింది. తిరిగి వెళ్ళబోతూ ఇంకో ఫారం కూడా తీసింది సాహితి ....ఇంకా ఏమిటి అన్నట్టు ఆ ఫారం రంగు కేసి చూసి అవాక్కయ్యారు Mrs లెసా. ABA కంప్లైంట్ ఫారం ఎర్రరంగు లో ఉంటుంది. ఇన్ని ఏళ్లలో స్కూల్ మీద ఒక్క కంప్లైంట్ కూడా లేదు..స్కూల్ కి "బుల్లీయింగ్ ఫ్రీ "అవార్డు కూడా వచ్చింది మేయర్ నుంచి ....ఇప్పుడు ...అది కూడా 8 ఏళ్ల పిల్ల దగ్గరనుంచా? ....కొంచెం బాధగా అనిపించినా ...సాహితీ ధైర్యానికి ముచ్చటేసింది Mrs లిసా కి.....

" వెల్ డన్ సాహితీ ...ఐ రీడ్ యువర్ కంప్లైంట్ నోట్ చేసుకున్నాను. యు డోంట్ వర్రీ కంటిన్యూ టు స్టే స్ట్రాంగ్ , నేను యాక్షన్ తీసుకుంటాను. స్కూల్ కౌన్సెలర్ మీ పేరెంట్స్‌తోను, నీ బుల్లీ తో కూడా మాట్లాడతారు " అంటూ భుజం నిమిరి చెప్పింది.

రీసెస్ టైం అయ్యింది .....పిల్లలంతా బయటికి వచ్చారు. అప్పటికే కంప్లైంట్ గురించి తెలిసిపోయింది స్టేసీ కి....సాహితి కోసం వెతికింది...లంచ్ ఏరియాలో పీర్ హోంవర్క్ హెల్ప్ క్లబ్ గురించి అడ్వేర్టైజ్ చేస్తూ ఒక బోర్డు ,పక్కనే తన టెడ్డీబేర్, ఫార్మ్స్ పెట్టుకుని పిల్లల కోసం చూస్తూ బెంచ్ మీద కూర్చుంది సాహితి, వారమంతా అమ్మ చేసిన బోధ గుర్తుచేసుకుంటూ....

“ఎవరైనా బుల్లీయింగ్ చేస్తే అది తన తప్పేమీ కాదు. ధైర్యం గా సూటిగా సమాధానం చెప్పాలి. నిజమైన ఫ్రెండ్స్ మనం ఎలా ఉన్నా స్నేహం చేస్తారు, ఎగతాళి చెయ్యరు , మన వెనుక మాట్లాడు కోరు. ఒకవేళ అలా చేస్తే మన ఫ్రెండ్స్ కారు. అలాటివాళ్ళు స్నేహం అవసరం లేదు. ఎవరికోసమో మనం చిన్నబుచ్చుకోవక్కర్లేదు. సర్దుకు పోడానికి ప్రయత్నించ కూడదు...ఒకవేళ భయం వేస్తే పెద్ద వాళ్ళ దగ్గరకు, టీచర్ దగ్గరికి సాయం కోసం వెళ్లాలి...."

ఈ లోపు మిగతా పిల్లలందరితో తనవైపే కోపం గా వాస్తు కనిపించింది స్టేసీ .....సాహితీ ని దూరం నుంచి చూసి బిరబిరా నడుచుకుంటూ వచ్చి విసురుగా బోర్డు తీసి కింద పడేసింది.

" హౌ డేర్ యు కంప్లైన్ ఆన్ మీ " .....అని అరిచి టెడ్డి మీద చెయ్యి వేసి "దిస్ ఫ్లఫీ " అని ముట్టుకోబోతుండగా ....సాహితి కుర్చీలోంచి లేచి ఒక్కసారి గట్టిగా " డోంట్ టచ్--- ఇట్స్ నాట్ ఫ్లఫీ--- ఇంక దాని పెరు స్పంకీ" అంటూ స్టేసీ కళ్లలోకి సూటిగా చూస్తూ చెప్పింది.

"అల్సొ కీప్ యువర్ హాండ్స్ టు యువర్ సెల్ఫ్---ఐ యామ్ నాట్ యువర్ పంచింగ్ బ్యాగ్ " ఆశ్చర్యంగా అదిరిపోయి చూస్తున్నారు మిగతా పిల్లలంతా .

సాహితీ లో ఒక కొత్త పిల్లని చూసింది జూలీ కూడా... తాను అలాగే అవ్వాలి అని ఎన్నిసార్లో అనుకుంది, ఒకప్పుడు స్టేసీ బుల్లియింగ్ బారినపడిన రోజుల్లో. ...ఇంక ఒక్క క్షణం ఆలస్యం చేయలేదు, కిందపడ్డ బోర్డు చేతికి అందిస్తూ---

"సాహితీ ఐయామ్ కమింగ్ టు యువర్ బర్త్ డే పార్టీ ....వి డోంట్ హావ్ ఎనీ పూల్ పార్టీ " అంటూ చెప్పింది జూలీ స్టేసీ కేసి సూటిగా చూస్తూ...

ఇదంతా గమనిస్తున్న జెనెట్ కి అర్ధం కాలేదు కాసేపు, మాథెమాటిక్స్ లో వీక్ అనుకుంది సాహితి కానీ??. పీర్ హోంవర్క్ క్లబ్ పెట్టాలంటే 100% రావాలి? చాలా ఆశ్చర్యంగా చూస్తూ క్యారోలిన్ చెయ్యి పట్టుకుని సైగ చేసింది ఇద్దరు కలిసి వెళ్లి.. టేబుల్ మీద ఉన్న ఫారం తీసుకున్నారు సైనప్ చెయ్యడానికి...

ఇదంతా చూస్తూ స్టేసీ ఒంటరిగా స్థబ్దుగా అలా నిలబడిపోయింది..

COMMENTS